

## ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

- తొగరుపల్లి వాసి రాజశేఖర్‌కు రూ.15 వేల ఆర్థిక సాయం..

2




# సంగారెడ్డి మెదక్

గురువారం 03 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:16






# యూరియా కోసం రైతుల కష్టాలు తప్పడం లేదు

### - సర్వర్ సమస్యతో - గంటల తరబడి నిరీక్షణ..

### మండుతున్న ఎండలో అన్నదాతల అవస్థలు

మెదక్ (ప్రజాజ్యోతి)

యూరియా కోసం రైతుల కష్టాలు తప్పడం లేదు. పాపన్నపేట్ మండల కేంద్రంలోని పోస్టాఫీసులో యూరియా నిల్వలు అందుబాటులోకి రావడంతో రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అయితే సర్వర్ సమస్య తలెత్తడంతో సుమారు రెండు గంటలపాటు యూరియా పంపిణీకి అంతరాయం ఏర్పడింది. దీంతో యూరియా కోసం వచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా రైతులు సొసైటీ వద్ద బారులు తీరారు.

మిగతా 2 లో

# మెదక్‌లో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు విస్తృత పర్యటన



### - పాపన్నపేటలో ఐజెల్

### - వాటర్ ప్లాంట్ ప్రారంభం..



మెదక్ (ప్రజా జ్యోతి)

అరికెల, నాగ్సన్‌పల్లి, నర్సింగ్రావుపల్లిలో బోర్‌వెల్స్ ఏర్పాటు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, పెన్షన్ చెక్కుల పంపిణీ ప్రజా సంక్షేమమే లక్ష్యం.. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే రోహిత్‌రావు ప్రాధాన్యత మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు బుధవారం తన షెడ్యూల్ ప్రకారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ పర్యటనలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలు, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ ప్రయోజనాలను అందించే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాపన్నపేట మండలం అరికెల గ్రామంలో ఐజెల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

మిగతా 2 లో

# మెదక్‌లో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు విస్తృత పర్యటన

మొదటిపేజీ తరువాయి




గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.అదేవిధంగా పాపన్నపేట మండలంలోని అరికెల, నాగ్సన్‌పల్లి, నర్సింగ్రావుపల్లి గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఎం ఎస్ ఎస్ ఓ ఆధ్వర్యంలో తన సొంత నిధులతో బోర్‌వెల్స్ ఏర్పాటు చేయించి ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలను నిరంతరం చేపడతామని ఆయన తెలిపారు.పాపన్నపేట మండలం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. సిఎం ఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.అనంతరం మెదక్ పట్టణం హెచ్ కన్వెన్షన్ హాల్లో మెదక్ మండలానికి సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. అదే సమయంలో సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను కూడా పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై ఎమ్మెల్యే లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.అదేవిధంగా హవేలీ ఘన్‌పూర్ మండలంలోని రైతు వేదిక వద్ద స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. అర్హులైన లబ్ధిదారులకు కార్డులను ఎమ్మెల్యే అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ఉపయోగపడుతున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఎమ్మెల్యే తన పర్యటనలో భాగంగా నాగ్సన్‌పల్లి గ్రామ సర్పంచ్ కుమారుడి హాజరై నూతన వధూవరులను, కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారి కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.ప్రజలకు తాగునీరు, రేషన్, పెన్షన్ వంటి ప్రాథమిక అవసరాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మరింత మెరుగుపరచేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. ప్రజల సహకారంతో మెదక్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

---

# యూరియా కోసం రైతుల కష్టాలు తప్పడం లేదు

మొదటిపేజీ తరువాయి



సర్వర్ ఎప్పుడు పనిచేస్తుందో తెలియక పలువురు రైతులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.పంటలకు కీలక సమయంలో యూరియా కోసం ఇలా గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సర్వర్ సమస్యలను వెంటనే పరిష్కరించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేయాలని కోరుతున్నారు. ఎల్‌ఈనో ప్రభావంతో వర్షాలు సరిగ్గా పడక మెదక్ జిల్లాకు గుండెకాయ అయినటువంటి సింగూర్ ప్రాజెక్టులో నీళ్లు సరిగా నింపక సింగూరు ప్రాజెక్టు నుండి పంట కాలువల ద్వారా నీరు సరఫరా సరిగ్గా కాకుండా ప్రాజెక్టు రిపేరింగ్ పనులు చేయక రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

---

# ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మొదటిపేజీ తరువాయి

**కొండాపూర్ ప్రజా జ్యోతి**



తొగరుపల్లి గ్రామానికి చెందిన సూర్యాపేట రాజశేఖర్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.15,000 విలువైన చెక్కును సంగారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు చింత ప్రభాకర్ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అర్హులైన వారికి ఆర్థిక సహాయం అందిస్తూ వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.రాజశేఖర్ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందిన ఆర్థిక సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు ఎర్రోళ్ల రవితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేని కలిసిన మెదక్ జిల్లా పోలీస్ అసోసియేషన్

## - పోలీస్ క్యాంటీన్ కొరకు 20 లక్షల స్పెషల్ ఫండ్ మంజూరు

**మెదక్ (ప్రజాజ్యోతి)**

ఇటీవల ఎన్నికైన మెదక్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు అంతొల్లా అభిలాష్, వైస్ ప్రెసిడెంట్ సందీప్ రెడ్డి, జెనరల్ సెక్రటరీ నరేష్, రాము ఆధ్వర్యంలో జిల్లా కమిటీ మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ని మర్యాద పూర్వకంగా కలిసి మెదక్ జిల్లా పోలీస్ స్టోర్, క్యాంటిన్ బిల్డింగ్ సంక్షన్ కొరకు 20 లక్షలు మంజూరు చేయాలని కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ నుండి 20 లక్షలు మంజూరు చేసారు. ఎమ్మెల్యే కి జిల్లా పోలీస్ అసోసియేషన్ ధన్యవాదములు తెలిపారు. కమిటీ సభ్యులు ఆర్గనైజింగ్ సెక్రటరీ సత్యనారాయణ, విజయ్,గంగమని, భాగ్యలక్ష్మి, సరిత, రేణుక,గోపాల్,నర్సింలు, పరమేశ్వర్,లక్ష్మీ నారాయణ, నర్సిములు,భూషణం, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు అరెస్ట్

## -100 గ్రాముల గంజాయి స్వాధీనం..

## - తూప్రాన్ ఎస్ఐ గంగరాజు

**తూప్రాన్ (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 02:**



తూప్రాన్ పట్టణ పరిధిలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా చీఎ-44 నర్సాపూర్ బ్రిడ్జి సమీపంలో ఎస్ఐ గంగరాజు ఆధ్వర్యంలో సుమారు 100 గ్రాముల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.గంజాయితో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసామని ఎస్ఐ తెలిపారు .పోలీసుల వివరాల ప్రకారం.. అలావుద్దీన్, లవకుష్ అనే ఇద్దరు వ్యక్తులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారు. వీరు తూప్రాన్ మండలంలోని శభాష్‌పల్లి ప్రాంతంలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఉత్తరప్రదేశ్ నుంచి కంపెనీకి తిరిగి వస్తున్న సమయంలో తమ వెంట గంజాయిని తీసుకొచ్చినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.అనుమానంతో తనిఖీలు చేపట్టిన పోలీసులు వారి వద్ద ఉన్న సుమారు 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరిపై ఎన్ డి పి ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.గంజాయి గుట్టు విప్పే పనిలో పోలీసులుగంజాయిని అసలు ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, ఎవరి వద్ద నుంచి కొనుగోలు చేశారు, తూప్రాన్‌లో ఎవరికి సరఫరా చేయడానికి తీసుకొచ్చారు, అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ వ్యవహారం వెనుక మరెవరైనా ఉన్నారా అనే అంశంపైనా విచారణ కొనసాగుతోంది.మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై తూప్రాన్ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

## - పెట్టుబడులు, డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్‌లో జాగ్రత్త అవసరం

## - మెదక్ సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్



**మెదక్ (ప్రజా జ్యోతి)**

పెట్టుబడులు, డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్ విషయంలో సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మెదక్ సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్ సూచించారు. సైబర్ జాగృత దివస్ సందర్భంగా బుధవారం మెదక్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు ప్రజల అత్యాశ, భయం, తొందరపాటును ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పెట్టుబడి మోసాలు, డిజిటల్ చెల్లింపుల మోసాలు, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులు, అనుమానాస్పద యాప్‌లు, ఫోన్ కాల్స్, మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, ఏటీఎం/డెబిట్ కార్డు వివరాలు, పిన్, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు.సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే మోసం జరిగిన వెంటనే 'గోల్డెన్ అవర్'లో ఫిర్యాదు చేస్తే మోసపోయిన



నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సైబర్ మోసాల కారణంగా ప్రజలు భారీగా ఆర్థిక నష్టాలకు గురవుతున్నారని, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు.కార్యక్రమంలో డీఎస్పీ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సొంత విత్తనాలు వాడిన రైతులకూ రూ.500 బోనస్ ఇవ్వాలి

**మెదక్ (ప్రజా జ్యోతి)**

విత్తనాల కొనుగోలు వివరాల నమోదును తప్పనిసరి చేయడం సరికాదు: మెదక్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు బి కొండల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ఏడు రకాల సన్న వరి సాగు చేస్తున్న రైతులు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్న నేపథ్యంలో, సొంతంగా విత్తనాలను సమకూర్చుకుని సాగు చేసిన రైతులకు కూడా బోనస్ వర్తింపజేయాలని మెదక్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు బి. కొండారెడ్డి కోరారు.బోనస్ పొందేందుకు రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన షాపుల వద్ద ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని, విత్తనాల కొనుగోలు వివరాలను జత చేసిన వారికి మాత్రమే బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం పేర్కొనడం సరైన నిర్ణయం కాదన్నారు. కొంతమంది రైతులు రబీ సీజన్‌లో పండించిన పంట నుంచి విత్తనాలను భద్రపరుచుకుని, తదుపరి ఖరీఫ్ సీజన్‌లో వాటినే విత్తనాలుగా వినియోగించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.రైతులు స్వయం సమృద్ధి సాధించేలా సొంత విత్తనాలను వినియోగించే వారిని ప్రభుత్వం ప్రోత్సహించాలని కొండారెడ్డి సూచించారు. విత్తన కంపెనీల ప్రయోజనాల కంటే రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, సొంతంగా విత్తనాలు సమకూర్చుకుని సన్న వరి సాగు చేసిన రైతులందరికీ క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



# మల్కాపూర్ తండా సమీపంలో అక్రమ ఇసుక తవ్వకాలు





మెదక్ (ప్రజాజ్యోతి)

అటవీ భూముల్లో అక్రమ తవ్వకాలపై అధికారుల కొరడా జేసీబీ, టిప్పర్ స్వాధీనంలి మెదక్ మండలం మల్కాపూర్ తాండ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ అటవీ సంపదను కొల్లగొడుతున్న అక్రమార్కులపై అటవీశాఖ అధికారులు చర్యలకు దిగారు. మల్కాపూర్ తండా సమీపంలోని అటవీ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గణేష్ ఆధ్వర్యంలో అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అటవీ భూమిని విచ్చలవిడిగా తవ్వుతున్న జేసీబీతో పాటు టిప్పర్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.అటవీ భూముల్లో అక్రమ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. అటవీ సంపదను పరిరక్షించేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. అటవీ సంపదను కాపాడే బాధ్యత ప్రతి ఒక్క పౌరునిపై ఉందని అటవీ ప్రాంతంలో ఏదైనా కదలికలు కనిపిస్తే మమ్మల్ని సంప్రదించాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గణేష్ కోరడం జరిగింది

# 420 హామీలు ఎక్కడ..? ఆరు గ్యారంటీల అమలు ఏది..?

## - కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నిరసన.. - 'బాకీ కార్డుల' పంపిణీ








మెదక్ (ప్రజా జ్యోతి)

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.మెదక్ మెయిన్ చౌరస్తా అయినా శివాజీ సర్కిల్ వద్ద నుండి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును వివరిస్తూ పొడవైన ఫ్లెక్సీతో నిరసన తెలిపారు. అనంతరం ధర్నా నిర్వహించి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఇప్పటివరకు అమలు చేసినవి, అమలు చేయనివాటిని వివరిస్తూ 'బాకీ కార్డులు' పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రజలకు ఎంత బాకీ ఉందో లెక్కలతో వివరించేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు.పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 33 నెలలు పూర్తవుతున్నా ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో అనేకం అమలు కాలేదని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని, ఇతర హామీలను నెరవేరుస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించినప్పటికీ వాటి అమలులో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి జగపతి ఆరేళ్ల మల్లికార్జున గౌడ్ మాజీ మరియు తాజా కౌన్సిలర్లు పెరిక కిషన్ గడ్డమీద కృష్ణ గౌడ్ మామిడిలో ఆంజనేయులు ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాజ్యోతి
గురువారం 03 సెప్టెంబర్ 2026



# జిల్లా పంచాయతీ అధికారుల అండదండలతోనే అక్రమ నిర్మాణాలు...

## - ఆర్చ్ నిర్మాణానికి గ్రామపంచాయతీ అనుమతులు ఎలా ఇస్తారు?
## - అక్రమ నిర్మాణాలకు గ్రామపంచాయతీ సపోర్టా?
## - 115 ఎకరాల వెంచర్‌పై మౌనం ఎందుకు?
## - నోటీసులు.. ఆరు నెలలుగా చర్యలు శూన్యం!


ప్రజాజ్యోతి

అనుమతులు రాకుండానే భారీ ప్రహరీ గోడ!

- 115 ఎకరాల వెంచర్ చుట్టూ నిర్మాణ పనులు.
- అనుమతులు లేని నిర్మాణాలకు అధికారుల అండదండలేనా?
- అక్రమమని తెలిసినా జిల్లా స్థాయి పంచాయతీ అధికారుల మౌనం..
- ప్రజా జ్యోతి వరుస కథనాలతోనూ స్పందన కరువు.

కొండాపూర్ ప్రజా జ్యోతి

కొండాపూర్ మండల పరిధిలో అక్రమ వెంచర్ నిర్మాణాలపై పంచాయతీ అధికారుల తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అక్రమ నిర్మాణాలపై ఒకటి,రెండు నోటీసులు జారీ చేసినప్పటికీ ఆరు నెలలు గడుస్తున్నా తదుపరి చర్యలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారులు నోటీసులు జారీ చేయడం వరకే పరిమితమయ్యారా? లేక అక్రమ నిర్మాణదారులకు పరోక్షంగా అండదండలు అందుతున్నాయా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

### 115 ఎకరాల్లో భారీ ప్రహరీ గోడ నిర్మాణం?

మన్నాన్పల్లి గ్రామ శివారులోని లక్ష్మారెడ్డిగూడెం గేటు సమీపంలో సర్వే నంబర్లు 36, 37, 42, 43, 44, 47, 48, 49, 50, 51, 52, 53, 54, 80, 81, 82, 83 పరిధిలో సుమారు 115 ఎకరాల భూమిలో వెంచర్ ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ భూమికి భారీగా విలువ ఉందని, స్థానికుల ప్రకారం ఎకరాకు సుమారు రూ.5 నుంచి రూ.6 కోట్ల వరకు ధర పలుకుతున్నట్లు తెలుస్తోంది. ఇంతటి విలువైన భూమిలో పంచాయతీ అనుమతులు లేకుండానే భారీ ప్రహరీ గోడ, ఆర్చ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

### ఓ నోటీసు జారి ఆ తర్వాత పంచాయతీ కార్యదర్శి అంతా మౌనమే!

మల్కాపూర్, మునిదేవునిపల్లి గ్రామాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు మూడు నోటీసులు జారీ చేసినప్పటికీ, తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పి సుమారు ఆరు నెలలు గడిచినా నిర్మాణాలను తొలగించడం కానీ, పనులను పూర్తిగా నిలిపివేయడం కానీ జరగలేదని ఆరోపిస్తున్నారు.నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తిస్తే కేవలం నోటీసులు జారీ చేసి వదిలేయడం ఎందుకనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా పనులు కొనసాగుతున్నట్లయితే వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత ఎవరిదనే ప్రశ్న స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది.

### అధికారుల ఆదేశాల్లో స్పష్టతేది?

అక్రమ నిర్మాణాలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి తెలిపామని డీఎల్‌పీఓ పేర్కొన్నట్లు సమాచారం. మరోవైపు నిర్మాణ పనుల విషయంలో జిల్లా స్థాయి అధికారుల నుంచి స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం పలు అనుమానాలకు కారణమవుతోంది.

### ఒకవైపు నోటీసులు.. మరోవైపు నిర్మాణ పనులు

కొనసాగుతున్న పరిస్థితి ఎందుకు ఏర్పడింది? అక్రమమైతే వెంటనే పనులు ఎందుకు నిలిపివేయడం లేదు? అనుమతులు ఉంటే వాటి వివరాలను అధికారులు ఎందుకు వెల్లడించడం లేదు? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



### నోటీసులకే పరిమితమా..

### చర్యలు ఎప్పుడు?

మల్కాపూర్ సర్వే నంబర్ 158/ఈతో పాటు మన్నాన్పల్లి పరిధిలోని పలు సర్వే నంబర్లలో జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పంచాయతీ అనుమతులు, లేఅవుట్ అనుమతులు, నిర్మాణ అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాలను అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.మూడు నోటీసులు జారీ చేసి ఆరు నెలలు గడిచినా చర్యలు లేకపోవడంపై జిల్లా పంచాయతీ అధికారులు సమాధానం చెప్పాలని, అక్రమమని తేలితే నిర్మాణాలను తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటారా? లేక 115 ఎకరాల వెంచర్‌పై నిజంగా చర్యలు తీసుకుంటారా? అనేది వేచి చూడాల్సిందే.


ప్రజాజ్యోతి

అక్రమ వెంచర్లు కనిపించవా.. అధికారుల కళ్లు మూశాయా?

- మన్నాన్పల్లి లో 115 ఎకరాల్లో భారీ ప్రహరీ గోడ నిర్మాణ పనులు. చర్యలు ఎప్పుడు?
- మల్కాపూర్ 158/ఈ లో అనుమతులు లేకుండా 8 ప్లాట్ల నిర్మాణాలు
- కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో అక్రమ నిర్మాణ పనులు.
- సంబంధిత పంచాయతీ అధికారులకు ఈ అక్రమాలు కనిపించడం లేదా?



# ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించుకోవాలి

## - సెప్టెంబర్ 16లోగా క్లైయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేసుకోవాలి

## - అర్హత కలిగిన ప్రతి పౌరుడు  ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగస్వామి కావాలి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

సంగారెడ్డి, ప్రజా జ్యోతి సెప్టెంబర్ 2:- భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ  ప్రక్రియ కొనసాగు తున్నందున, అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి, ఓటరు జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు.ఎస్ఐఆర్ షెడ్యూల్‌లో భాగంగా 2026 ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడం జరిగిందని తెలిపారు. ముసాయిదా జాబితాలో తమ పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా తప్పులు, మార్పులు లేదా అభ్యంతరాలు ఉన్నట్లయితే నిర్దేశిత గడువులోగా సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆరో) వద్ద క్లైయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేయాలని కోరారు.క్లైయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు గడువు సెప్టెంబర్ 16 వరకు ఉందని తెలిపారు. అర్హత కలిగిన పౌరులు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు, వివరాల సవరణ తదితర అంశాలకు సంబంధించి క్లైయిమ్‌లు, అభ్యంతరాలను సంబంధిత ఈఆర్వో వద్ద నిర్దేశిత విధానంలో సమర్పించవచ్చని పేర్కొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా స్వీకరించిన క్లైయిమ్స్, అభ్యంతరాల జాబితాలను ప్రజల సమాచారార్థం అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత ఈఆర్వోలు ఈ జాబితాలను వారానికి ఒకసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేస్తారని పేర్కొన్నారు. జాబితాలో చేర్చిన ఏదైనా క్లైయిమ్‌పై అభ్యంతరం ఉన్న పౌరులు నిర్దేశిత విధానాన్ని అనుసరించి సంబంధిత వీఆర్వోను సంప్రదించవచ్చని తెలిపారు.క్లైయిమ్ లేదా అభ్యంతరంపై సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (వీఆర్వో) తీసుకున్న నిర్ణయంపై సంతృప్తి చెందని వారు  మొదటి అప్పీల్ అధికారిగా జిల్లా మెజిస్ట్రేట్ కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.



అదేవిధంగా, మొదటి అప్పీల్ అధికారి ఇచ్చిన నిర్ణయంపై సంతృప్తి చెందని వారు రెండవ అప్పీల్ అధికారిగా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని వివరించారు.ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సంబంధించిన సమాచారం ప్రతి అర్హత కలిగిన పౌరుడికి చేరేలా  ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ కోరారు.అర్హత కలిగిన ప్రతి పౌరుడు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, అవసరమైన చోట క్లైయిమ్‌లు లేదా అభ్యంతరాలను నిర్దేశిత గడువులోగా దాఖలు చేసుకుని ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని  కలెక్టర్  కోరారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

## - ఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి










**నారాయణఖేడ్, సెప్టెంబర్ 2, ప్రజాజ్యోతి:** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. హామీల అమలును డిమాండ్ చేస్తూ బుధవారం ఆయన ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించి రాజీవ్‌చౌక్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ప్రకటించిన 420 హామీల్లో అనేక హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మహిళలకు ప్రకటించిన పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు నారాయణఖేడ్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ 'బాకీ కార్డులను' ప్రజలకు అందజేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి జవాబుదారీతనంతో పాలన అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పరశురాం, పార్టీ పట్టణ అధ్యక్షుడు బాదల్‌గామ నగేష్, మున్సిపల్ కౌన్సిలర్లు విజయ్ బుజ్జి, అభిషేక్ షెట్కార్, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, మాజీ కోఆప్షన్ సభ్యులు అంబాదాస్, నాయకులు షబ్బీర్ అలీ, సిద్దు, సతీష్ కుమార్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపేట్ మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

## - మోడల్ స్కూల్, సెట్‌విన్ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు

## - మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి





**నారాయణఖేడ్, సెప్టెంబర్ 2, ప్రజాజ్యోతి:**

నిజాంపేట్ మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. నిజాంపేట్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో మండలంలోని అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిజాంపేట్ మండలానికి ప్రభుత్వ మోడల్ స్కూల్ ఏర్పాటు చేయడంతో పాటు సెట్‌విన్ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని మహిళా సంఘాలకు పెట్రోల్ పంప్ మంజూరు చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో అధికారులు, సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రైతుల సమస్యలు, రహదారులు, విద్య, వైద్యం, తాగునీరు, మిషన్ భగీరథ, విద్యుత్ సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, పెండింగ్‌లో ఉన్న ఇళ్ల సమస్యలపై చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, సమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని, గ్రామాభివృద్ధికి



తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నూతన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సమావేశంలో ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్, నిజాంపేట్ మండల ప్రత్యేక అధికారి నూతన్ కుమార్, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ ఆశయాల సాధనకు కృషి చేయడమే నిజమైన నివాళి

## - ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 2, ప్రజాజ్యోతి:**

వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ పేదలు, రైతులు, మహిళలు, అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగృహంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, కార్మికులు సహా అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక చారిత్రాత్మక పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఆరోగ్యం, విద్య,





వ్యవసాయం, పేదల సంక్షేమం కోసం ఆయన తీసుకున్న నిర్ణయాలు నేటికీ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ చూపిన బాటలో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన వైఫల్యాల పై ఎమ్మెల్యే మాణిక్ రావు

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జహీరాబాద్ నియోజకవర్గ కేంద్రంలో భారీ ధర్నా
- 420 మోసాల యొక్క భారీ బ్యానర్ ప్రదర్శన
- ప్రజా సమస్యలపై పోరాటం.. ప్రజల పక్షాన బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాణిక్ రావు



**జహీరాబాద్, సెప్టెంబర్ 02 (ప్రజా జ్యోతి న్యూస్)**

పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన వైఫల్యాలు, అమలు కాని హామీలు, ప్రజలను మోసం చేసిన తీరును నిరసిస్తూ బుధవారం భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమా నికి శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు, మాజి డిసిఎంఎస్ చైర్మన్ శివ కుమార్ హాజరై నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఎమ్మెల్యే విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ వైఫల్యా లపై నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయా లని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజి మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజి ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, మాజి మున్సిపల్ చైర్మన్ లు అల్లాడి నర్సింలు, తంజిం, సీనియర్ నాయకులు నామా రవికిరణ్, మాజి పట్టణ అధ్యక్షులు యాకూబ్, జహీరాబాద్ & కోహీర్ కౌన్సిలర్ లు,బొగ్గుల సంగమేశ్వర్,నరసింహ రెడ్డి, సురేష్, ఖలీమ్, పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వాగ్దానాలు ఎన్నో.. అమలు ఏదీ?"

- విఫలమైన తెలంగాణ కాంగ్రెస్ సర్కార్.
- కల్హేర్‌లో బీఆర్ఎస్ నిరసన

**కల్హేర్, సెప్టెంబర్ 2 (ప్రజాజ్యోతి):**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం కల్హేర్ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ , మహిళలకు నెలకు రూ. 2,500, వివాహమైన ప్రతి ఆడబిడ్డకు తులం బంగారం, ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సాయం వంటి హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని నాయకులు విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, కేటీఆర్ , హరీశ్‌రావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాంసింగ్, మాజీ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# వోల్టేజీ షాక్‌తో రాపర్తి రైతుల గగ్గోలు - ఎల్‌సీల పేరుతో విద్యుత్ కోతలు..

## తరచూ కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు రోజుకు కనీసం

## 15 గంటల కరెంట్ ఇవ్వాలని రైతుల డిమాండ్

**కల్హేర్, సెప్టెంబర్ 2: ప్రజా జ్యోతి**

సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలోని రాపర్తి గ్రామంలో విద్యుత్ సమస్యలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వం 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో ఎల్‌సీల పేరుతో సుమారు గంటన్నర పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో పాటు, విద్యుత్ వచ్చిన సమయంలో వోల్టేజీలో హెచ్చుతగ్గులు చోటుచేసుకుంటున్నాయని రైతులు చెబుతున్నారు. దీంతో వ్యవసాయ మోటార్లు, విద్యుత్ పరికరాలు దెబ్బతినడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు కీలకమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో సాగునీటి సమస్య ఎదురవుతోందని రైతులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో మరమ్మతులు, పునరుద్ధరణ కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని పేర్కొన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని గ్రామ రైతులు కోరుతున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి వరకు, అలాగే ఉదయం వేళల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసి రోజుకు కనీసం 15 గంటల కరెంట్ అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే రాపర్తి గ్రామంలో నెలకొన్న వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, తరచూ కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో అధిక సామర్థ్యం కలిగిన



ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రైతుల విద్యుత్ కష్టాలను ఇకనైనా అధికారులు పట్టించుకుని తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# వైద్య కళాశాల, జీజీహెచ్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం

- రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి
- ఈ నెల 17న నర్సింగ్ కళాశాల, హాస్టల్, మెడికల్ కళాశాల స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలి
- సింగూర్ కాలువల లైనింగ్, కట్ట మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ





**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

జిల్లాలో వైద్య, ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్), నర్సింగ్ కళాశాలల్లో అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలను కల్పించి ప్రజలకు, విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి వైద్య ఆరోగ్యశాఖ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాల, సంగారెడ్డి, జోగిపేట నర్సింగ్ కళాశాలలు, ఆర్అండ్‌బీ, నీటిపారుదల శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, అవసరమైన పరికరాలు, నిర్వహణ, పెండింగ్ పనులు, భవిష్యత్ అవసరాలపై సమగ్రంగా సమీక్షించారు.ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, గర్ల్స్, బాయ్స్ హాస్టళ్లలో అవసరమైన సౌకర్యాలు, పరికరాలు, చేపట్టాల్సిన అదనపు పనులపై కళాశాల ప్రిన్సిపాల్‌ను మంత్రి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యాభ్యాసానికి అనుకూలమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.జీజీహెచ్‌లో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, వాటి నిర్వహణ, భవన నిర్వహణ, రోగుల సంరక్షణ, పారిశుద్ధ్యం, సెక్యూరిటీ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణను మంత్రి అడిగి తెలుసుకున్నారు.మెడికల్ కళాశాల, హాస్టళ్లు, జీజీహెచ్‌కు సంబంధించిన వార్షిక నిర్వహణ అవసరాలను కళాశాల ప్రిన్సిపాల్, జీజీహెచ్ అధికారులతో సమన్వయం చేసుకుని, ఒక్కో అంశాన్ని గుర్తించి అవసరమైన పనులకు ప్రాధాన్యతా క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలను ఆదేశించారు.జీజీహెచ్ భవన నిర్వహణ, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, బయోమెడికల్ వేస్ట్ నిర్వహణ, మెడికల్ కళాశాల శానిటేషన్, సెక్యూరిటీ, ఎస్‌టీపీ నిర్వహణ, పీజీ గర్ల్స్ హాస్టల్, ఆడిటోరియం తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు.మెడికల్ కళాశాల, జీజీహెచ్ నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న అన్ని ఏజెన్సీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, పనుల నిర్వహణపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని మంత్రి సూచించారు.ఆసుపత్రిలో ఉన్న అన్ని వైద్య పరికరాలకు సంబంధించిన పూర్తి వివరాలు, వాటి పనితీరు, వినియోగం, మరమ్మతులు, అవసరమైన అదనపు పరికరాలపై సమగ్ర సమాచారం అందుబాటులో ఉండాలని మంత్రి సూచించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాల వివరాలను తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య సేవలు నిరంతరాయంగా, నాణ్యతా ప్రమాణాలతో అందించాలని సూచించారు.మెడికల్ కళాశాలలో ఆడిటోరియం నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపించాలని కళాశాల ప్రిన్సిపాల్‌ను మంత్రి ఆదేశించారు.సంగారెడ్డి, జోగిపేట నర్సింగ్ కళాశాలల అభివృద్ధి పనులు, నర్సింగ్ హాస్టళ్ల పురోగతి, విద్యార్థుల సంఖ్య, టీచింగ్ ఫ్యాకల్టీ, అవసరమైన పరికరాలు, వసతి సౌకర్యాలు తదితర అంశాలపై సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లను మంత్రి అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు అవసరమైన పరికరాలు, మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలను అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులు ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా నర్సింగ్, మెడికల్ కళాశాలల్లో అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.ఈ నెల 17న సంగారెడ్డి నర్సింగ్ కళాశాల, నర్సింగ్ హాస్టల్, మెడికల్ కళాశాల స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవితో జిల్లాలో పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పీహెచ్‌సీలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తదితర వైద్య సంస్థలపై మంత్రి సమీక్షించారు. ఆయా ఆసుపత్రుల్లో మిగిలిన చిన్నచిన్న పనులు, పరికరాల ఏర్పాటు, సిబ్బంది, ఇతర అవసరాలను వెంటనే పూర్తి చేసి ఈ నెలాఖరులోగా ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.నీటిపారుదల శాఖ అధికారులతో సింగూర్ ప్రాజెక్టు పరిధిలోని కాలువల లైనింగ్ పనులు, కట్ట మరమ్మతులు, ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్‌ఫ్లో, డెడ్ స్టోరేజ్, సగటు నీటిమట్టం, నీటి





నిల్వ సామర్థ్యం, పూర్తయిన పనులు, ఇంకా అవసరమైన నిధులపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు.కాలువల లైనింగ్, కట్ట మరమ్మత్తు పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నీటిపారుదల శాఖకు సంబంధించిన ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టి సంరక్షించాలని సూచించారు.కాలువల పరిరక్షణకు అవసరమైన చర్యల్లో భాగంగా పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. కాలువల పనులు, అవసరమైన నిధులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపించి అవసరమైన నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.అభివృద్ధి పనులన్నీ త్వరితగతిన పూర్తయ్యేలా సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, మెడికల్ , నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఆర్అండ్‌బీ, నీటిపారుదల శాఖల అధికారులు, సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# ఆరు గ్యారంటీలు.. 420 హామీలు ఏమయ్యాయి?

## - కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ సమరశంఖం

## - సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా.. 'కాంగ్రెస్ బాకీ కార్డుల' పంపిణీ




**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలులో వైఫల్యాలను ఎండగడుతూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ఆదేశాల మేరకు స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహ ఆవరణలో ఈ నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు.ధర్నా కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 420 హామీలతో కూడిన భారీ ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ..
ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ప్రజలకు గుర్తు చేశారు.

### ప్రజల మధ్యకు 'కాంగ్రెస్ బాకీ కార్డులు'

ధర్నా అనంతరం బీఆర్ఎస్ నాయకులు వినూత్నంగా 'కాంగ్రెస్ బాకీ కార్డులు' పంపిణీ చేశారు. బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రజలకు, ఆటోల్లో వెళ్తున్న ప్రయాణికులకు, ఇతర వాహనదారులకు, పాదచారులకు కార్డులను అందజేస్తూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేశారు."హామీలు ఇచ్చారు.. ఓట్లు అడిగారు.. అధికారంలోకి వచ్చారు.. కానీ హామీలు మాత్రం అమలు చేయలేదు" అంటూ ప్రజలకు వివరించారు.



### కాంగ్రెస్ పాలనపై చింత ప్రభాకర్ ఫైర్

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజుల పాలన పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీల్లో చాలా వరకు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలకు ఆశలు కల్పించి, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందని విమర్శించారు.రైతులకు రుణమాఫీ, రైతుభరోసా, మహిళలకు హామీ ఇచ్చిన పథకాలు, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగులకు భరోసా, ఉద్యోగులకు ఇచ్చిన హామీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, పేదలు, కార్మికులు ఇలా ఏ వర్గానికీ కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయలేదని అన్నారు.

### "ఏ వర్గం ప్రజలు సంతోషంగా లేరు"

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఏ వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరని చింత ప్రభాకర్ అన్నారు. ఎన్నికల ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారం ఉందని విమర్శించారు.రైతులు తమ సమస్యల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని, యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తోందని, మహిళలు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం రాజకీయ ప్రచారానికే పరిమితమైందని ఆరోపించారు.

### "13 డిక్లరేషన్ల పేరుతో ప్రజలను మోసం చేశారు"

రాహుల్ గాంధీ, సోనియా గాంధీ తెలంగాణకు వచ్చి వివిధ డిక్లరేషన్ల పేరుతో ప్రజలకు అనేక హామీలు ఇచ్చారని చింత ప్రభాకర్ విమర్శించారు.ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. సామాజిక న్యాయం, సంక్షేమం పేరుతో ప్రజలను ఆకర్షించి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాటను మరిచారని మండిపడ్డారు.

### "కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష"

తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం, సాగునీరు, రైతుల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని చింత ప్రభాకర్




అన్నారు."తెలంగాణకు మళ్లీ కేసీఆర్ నాయకత్వం అవసరం. కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష" అని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

### హామీలు అమలు చేయకపోతే ఉద్యమం ఉధృతం

ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తు పెట్టుకోవాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ రాజీ పడబోదని, ప్రభుత్వం తన వైఫల్యాలను సరిదిద్దుకోకపోతే వారం రోజుల కార్యక్రమాలను మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో మరింత విస్తృతంగా నిరసనలు చేపడతామని తెలిపారు."ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకగా బీఆర్ఎస్ ఉంటుంది.. ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగుతుంది" అని చింత ప్రభాకర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం ,మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, హకీమ్, డాక్టర్ శ్రీహరి, సునీల్, మనోహర్ గౌడ్, కొండల్ రెడ్డి, చింత సాయినాథ్ , మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి,చక్రపాణి, విఠల్, ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు చీల మలన్న, చింత గోపాల్ , శ్రవణ్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతర పోరాటం

- టీయూడబ్ల్యూజే హెచ్143తోనే సాధ్యం
- తెలంగాణ ఉద్యమం నుంచి జర్నలిస్టుల సంక్షేమం వరకు సంఘం కీలక పాత్ర
- త్వరలో నియోజకవర్గ, జిల్లా కమిటీల పూర్తి స్థాయిలో ఏర్పాటు.. రాష్ట్ర మహాసభకు సన్నాహాలు
- సుమారు 50 మంది జర్నలిస్టులకు సభ్యత్వాలు అందజేత



**పటాన్‌చెరు(ప్రజాజ్యోతి)**

జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక జర్నలిస్టు సంఘం టీయూడబ్ల్యూజే హెచ్143 అని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రజల పక్షాన నిలిచి పోరాడిన జర్నలిస్టుల సంఘం టీయూడబ్ల్యూజే హెచ్143 అని పేర్కొన్నారు. బుధవారం పటాన్‌చెరు నియోజకవర్గ జర్నలిస్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

## ఉద్యమంలో కీలక పాత్ర

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో జర్నలిస్టులు ప్రజల ఆకాంక్షలను ఎప్పటికప్పుడు సమాజం ముందుకు తీసుకెళ్లారని మారుతి సాగర్ తెలిపారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో జర్నలిస్టుల హక్కులు, ప్రజల సమస్యలపై సంఘం నిరంతరం పోరాటం చేసిందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడంలో టీయూడబ్ల్యూజే హెచ్143 కీలక పాత్ర పోషించిందని చెప్పారు.

## రూ.42 కోట్ల నిధి ఏర్పాటు

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం జర్నలిస్టుల సంక్షేమం కోసం అప్పటి ప్రభుత్వంతో చర్చలు జరిపి రూ.42 కోట్ల నిధిని ఏర్పాటు చేయించడంలో సంఘం ముఖ్యపాత్ర పోషించిందన్నారు. టీయూడబ్ల్యూజే హెచ్143 ఆధ్వర్యంలో, అల్లం నారాయణ నాయకత్వంలో సాధించిన ఈ ఘనత తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ చరిత్రలో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు, వృత్తిపరమైన భద్రత, హక్కుల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

## అక్రిడిటేషన్లపై పోరాటం

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మారుతి సాగర్ ఆరోపించారు. ముఖ్యంగా అక్రిడిటేషన్ కార్డుల విషయంలో ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలు వర్కింగ్ జర్నలిస్టులకు ఇబ్బందులు కలిగించేలా ఉన్నాయని అన్నారు. ఈ విషయంలో టీయూడబ్ల్యూజే హెచ్143 ప్రారంభంలోనే స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చిందన్నారు. ఫలితంగా వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అందేలా కృషి చేశామని తెలిపారు.

## హక్కుల కోసం ఉద్యమిస్తాం

రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం టీయూడబ్ల్యూజే హెచ్143 నిరంతరం ఉద్యమిస్తుందని మారుతి సాగర్ స్పష్టం చేశారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటి పరిష్కారం కోసం అవసరమైన అన్ని వేదికలపై పోరాటం చేస్తామని అన్నారు. జర్నలిస్టులు సంఘటితంగా ఉంటేనే తమ హక్కులను సాధించుకోగలరని, అందుకే ప్రతి జర్నలిస్టు సంఘ సభ్యత్వం తీసుకుని సంఘ బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

## త్వరలో రాష్ట్ర మహాసభ

రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీలను త్వరలో పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తామని మారుతి సాగర్ తెలిపారు. అన్ని ప్రాంతాల్లో సంఘాన్ని మరింత బలోపేతం చేసిన అనంతరం రాష్ట్రస్థాయి మహాసభను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. జర్నలిస్టుల సమస్యలను సమగ్రంగా చర్చించి






భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని వెల్లడించారు.అనంతరం పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన జర్నలిస్టులకు సభ్యత్వాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి యోగానంద్, ఎలక్ట్రాన్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరిగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీధర్, జాతీయ కౌన్సిల్ సభ్యులు తిరుపతినాయక్, భాస్కర్, జిల్లా ప్రతినిధులు వేణు, పరశురాం, రాజు, నగేష్, రాము తదితరులు పాల్గొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన పలువురు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ప్రజాజ్యోతి

గురువారం 03 సెప్టెంబర్ 2026

# తెలంగాణ ప్రజలను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

## -22ఏ భూముల సమస్యపై అసెంబ్లీని కదిలిస్తాం

## -అరచేతుల స్వర్గం చూపించి అందలమెక్కారు.. హామీలు అమలు చేయమంటే మొహం చాటేస్తున్నారు..

## -420 హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ దారుణ వైఫల్యం..

## -100 రోజులన్నారు..1000 రోజులు అయ్యింది..-ఏడు రోజుల పోరు బాటను విజయవంతం చేయండి..

## -ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..-కాంగ్రెస్ 420 హామీల అమలుకు బీఆర్ఎస్ పోరుబాట..

## -తొలి రోజు ఇంటింటికి బాకీ కార్డుల పంపిణీ..420 హామీల ఫ్లెక్సీ ప్రదర్శన




**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

420 హామీల పేరుతో అరచేతిలో స్వర్గం చూపించి అందలమెక్కిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్న.. హామీల అమలులో ఘోరంగా విఫలం కావడంతోపాటు.. విధ్వంస పాలన కొనసాగిస్తుందని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల దగా పాలన నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన వారం రోజుల పోరుబాట కార్యక్రమంలో భాగంగా తొలి రోజు పటాన్ చెరు పట్టణంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృతంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎంజీ రోడ్డు నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ఫ్లెక్సీ ప్రదర్శన, నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలకు బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో పాలన సాగిస్తోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. తొంభైవ దశకం నుంచి రాజకీయాల్లో ఉన్నప్పటికీ ఇంత దారుణమైన, దరిద్రమైన పరిపాలనను తాను చూడలేదని విమర్శించారు.

### ప్రజలకు ఇచ్చిన 420 హామీలు అమలు చేయాలి

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన 420 హామీలను ప్రజలకు ఇచ్చిన మాటగా భావించి వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని ఆరోపించారు.బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా పటాన్ చెరు నియోజకవర్గంలో కూడా ప్రతి ప్రజా సమస్యపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

### 22ఏ భూములపై పోరాటం ఉధృతం

22ఏ నిషేధిత జాబితాలో ఇలాంటి వివాదాలు లేని భూములను చేర్చడం ద్వారా ప్రజల ఆస్తులను అమ్ముకోలేని, కొనలేని పరిస్థితి ఏర్పడుతోందని ఎమ్మెల్యే అన్నారు. 22ఏ పేరుతో ప్రజల ఆస్తులపై విధిస్తున్న ఆంక్షలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు.22ఏ భూముల సమస్యను అసెంబ్లీలో ప్రధాన అంశంగా లేవనెత్తి, బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ఆయన స్పష్టం చేశారు.

### సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేశారు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ తదితర సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే జిఎంఆర్ ఆరోపించారు. పేదలు, మహిళలు, విద్యార్థులు, రైతులు, సామాన్య ప్రజలకు గతంలో అందిన సంక్షేమ పథకాలు ఇప్పుడు సక్రమంగా అందడం లేదని అన్నారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.



### ప్రతి గ్రామం, ప్రతి వార్డులో పోరాటం

పటాన్ చెరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి డివిజన్లో బీఆర్ఎస్ పోరు బాట కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును వివరించాలని సూచించారు.పార్టీ తరఫున పెద్ద సంఖ్యలో బకాయి హామీల కార్డులను సిద్ధం చేశామని, వాటిని నియోజకవర్గంలోని అన్ని డివిజన్లు, వార్డులు, గ్రామాలకు తీసుకెళ్లి ప్రజలకు పంపిణీ చేయాలని నాయకులకు సూచించారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం ఆగదని.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఓటు విలువైనదే.. జాబితా సవరణలో పారదర్శకతకు పెద్దపీట

- పోతులబోగుడలో ఎస్ఐఆర్ నోటీసులపై క్షేత్రస్థాయి విచారణ

**వట్పల్లి, సెప్టెంబర్ 2, (ప్రజాజ్యోతి):**

సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండల్అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు కాపాడటంతో పాటు ఓటర్ల జాబితాను మరింత కచ్చితంగా రూపొందించే దిశగా ఎస్ఐఆర్2026 ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా వాట్పల్లి మండలం పోతులబోగుడ గ్రామంలోని పోలింగ్ కేంద్రం నం.29 పరిధిలో నోటీసులు అందుకున్న ఓటర్ల వివరాలపై అధికారులు విచారణ చేపట్టారు.ఓటర్ల వివరాల్లో తేడాలు ఉన్న కేసులు, గత వివరాలతో అనుసంధానం కాని నమోదులను గుర్తించి వాటిపై స్పష్టత తీసుకునేందుకు ఈ విచారణ నిర్వహించారు. సంబంధిత ఓటర్ల నుంచి వివరాలను తెలుసుకుని, రికార్డులతో సరిపోల్చే ప్రక్రియ చేపట్టారు. దీంతో ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడటంతో పాటు అర్హులైన ఓటర్లకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.విచారణ సందర్భంగా ఓటర్లకు తమ వివరాలను పరిశీలించుకునే అవకాశం కల్పించారు. ప్రజల నుంచి వచ్చిన వివరాలను నమోదు చేసుకుని, అవసరమైన మేరకు తదుపరి పరిశీలన చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.ఈ విచారణలో మండల గిర్దావర్ హన్మంత్ రెడ్డి, ఓటర్ల జాబితా పర్యవేక్షకుడు ఉపేందర్ రెడ్డి, సంబంధిత బూత్ స్థాయి అధికారులు, పోతులబోగుడ గ్రామ పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



# 'గేట్'తో అవకాశాలను అందిపుచ్చుకోండి

- గీతం విద్యార్థులకు గేట్ ఏరోస్పేస్ అకాడమీ అశోక్ నాయుడు సూచన





**పటాన్‌చెరు(ప్రజాజ్యోతి)**

గేట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్)ను శ్రేష్ఠతకు ముఖద్వారంగా భావించాలని, పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం ద్వారా ఉన్నత విద్యతోపాటు మంచి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని గేట్ ఏరోస్పేస్ అకాడమీకి చెందిన అశోక్ నాయుడు సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆతిథ్య ఉపన్యాసంలో ఆయన మాట్లాడారు.

**విస్తృత ఉద్యోగ అవకాశాలు**

ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విద్యార్థులకు గేట్ ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు), రక్షణ సంస్థలు, పరిశోధనా సంస్థలు, ప్రైవేటు రంగంలో విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయని అశోక్ నాయుడు వివరించారు. విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యతోపాటు పోటీ పరీక్షలకు సైతం ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు.రక్షణ రంగంలో ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ (ఏఎఫ్‌క్యాట్), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్), షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) టెక్నికల్, యూనివర్సిటీ ఎంట్రీ స్కీమ్ (యూఈఎస్), టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు (టీజీసీ), ఎన్‌సీసీ ద్వారా ప్రవేశం వంటి మార్గాలున్నాయని తెలిపారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)లోనూ అవకాశాలను విద్యార్థులు అన్వేషించాలని సూచించారు.

**పరిశోధన వైపు అడుగులు**

ఉన్నత విద్య, పరిశోధన రంగాల్లోనూ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. డీఆర్‌డీవో, డీఆర్‌డీఎల్‌లో శాస్త్రవేత్తలుగా, భారత వైమానిక దళంలో టెక్నికల్ అధికారులుగా, సీఎస్ఐఆర్ పరిధిలో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌లు పొందే అవకాశాలున్నాయని తెలిపారు. ఐఐటీలు, ఐఐఎస్‌సీ వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో చేరి పరిశోధన రంగంలో రాణించవచ్చన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఏకాగ్రతతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని విద్యార్థులకు సూచించారు.

# సైబర్ జాగృకత దివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు.

- డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్, పెట్టుబడి మోసాలపై అవగాహన తప్పనిసరి..
- సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండండి.. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

సెప్టెంబర్ నెల మొదటి మొదటి బుధవారం – సైబర్ జాగృకత దివాస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని, సదాశివపేట పట్టణంలోని హర్ష బ్యాంకేట్ హాల్ నందు సైబర్ నేరాల నివారణ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.., సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్, ఐపీఎస్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సైబర్ జాగృకత దివాస్ పేరుతో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా డిజిటల్ చెల్లింపులుడిజిటల్ భద్రత, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, పెట్టుబడి మోసాలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుంది అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో జాగ్రత్త : తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటిపి, పిఐఎన్, సివివి, పాస్‌వర్డ్‌లు వంటి రహస్య సమాచారాన్ని ఎవరితో పంచుకోవద్దని అన్నారు. బ్యాంకు అధికారులు, పోలీసుల పేరుతో ఫోన్ చేసే వ్యక్తులను నమ్మి వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలు ఇవ్వవద్దని, డిజిటల్ చెల్లింపులు చేసే సమయంలో సరైన వ్యక్తి/ఖాతాకే నగదు వెళ్తుందో నిర్ధారించుకోవలని సూచించారు. ఆన్‌లైన్ షాపింగ్‌లో అప్రమత్తత : ఆన్‌లైన్‌లో భారీ డిస్కౌంట్లు, ఆకర్షణీయమైన ఆఫర్లు చూపిస్తూ నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. గుర్తుతెలియని వెబ్‌సైట్లు, వ్యక్తులకు ముందస్తుగా నగదు చెల్లించకుండా, విశ్వసనీయమైన ప్లాట్‌ఫారమ్‌లను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు.పెట్టుబడి మోసాలపై అప్రమత్తంగా ఉండాలి : తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్, క్రిప్టో, షేర్ మార్కెట్ పేరుతో వచ్చే అనుమానాస్పద ఆఫర్లను నమ్మవద్దని సూచించారు. తొందరపెట్టి డబ్బులు పెట్టుబడి పెట్టించే వ్యక్తులు లేదా సంస్థల వివరాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని తెలిపారు.సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ లేదా ఞఞఞ.ఎఎవతీఎతీఱవ.స్త్రశీఙ.ఱఅ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. తద్వారా మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు.గణేష్ మండపాల వద్ద కూడా సైబర్ అవగాహన : గణేష్ చతుర్థి నవరాత్రి ఉత్సవాలు జరుగునున్న నేపథ్యంలో గణేష్ మండపాల వద్ద సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్లను ఏర్పాటు చేసి భక్తులు, ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శాంతి కమిటీ, సమన్వయ సమావేశాలను కూడా సైబర్ అవగాహన కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు.సైబర్ నేరాలను అరికట్టడంలో పోలీసులతో పాటు ప్రజల అప్రమత్తత కూడా ఎంతో కీలకం. చిన్న నిర్లక్ష్యం పెద్ద నష్టానికి దారితీయవచ్చు. ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతా నియమాలను పాటించి, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలి అని ఎస్పీ సూచించారు.





ఈ కార్యక్రమంలో డి4సి డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, సదాశివపేట ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, సైబర్ సెల్ సిబ్బంది, సదాశివపేట పట్టణానికి చెందిన సుమారు 350 మంది వ్యాపారవేత్తలు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వార్త రాస్తే బెదిరింపులా..?

## - మారేపల్లిలో సర్పంచ్ భర్త హల్‌చల్..- రిపోర్టర్ "అంతు చూస్తా" అంటూ హెచ్చరికలు!

## - పారిశుద్ధ్యంపై కథనం ప్రచురిస్తే బూతు పురాణం..

## - జర్నలిస్టులను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టర్లు వైరల్..

## - ప్రజా సమస్యలు రాయొద్దంటూ పెత్తనం..

## - తహసీల్దార్, ఆర్డీవో తక్షణమే స్పందించి జర్నలిస్టులకు న్యాయం చేయాలి.

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మారేపల్లి గ్రామంలో చెత్త పేరుకుపోయింది.. సమస్యను వెలుగులోకి తీసుకొస్తే తప్పా? పంచాయతీ పనితీరును ప్రశ్నిస్తే నేరమా? వార్త ప్రచురించినందుకు రిపోర్టర్లను బెదిరించే హక్కు ఎవరిచ్చారు? అంటూ మారేపల్లి గ్రామంలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.గ్రామంలో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసిన పరిస్థితిపై ప్రజా జ్యోతి దినపత్రికలో "పారిశుద్ధ్యం పడకేసింది.. పంచాయతీ బిల్లులు పరుగులు" అనే కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఈ వివాదం తెరపైకి వచ్చింది. గ్రామంలోని పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వార్తగా ప్రచురించడంతో సమస్య పరిష్కారం అవుతుందని రిపోర్టర్లు భావించారు.అయితే ఈ కథనాన్ని జీర్ణించుకోలేక సర్పంచ్ భర్త రిపోర్టర్లకు ఫోన్ చేసి అసభ్యకర పదజాలంతో దూషిస్తూ, "మీ అంతు చూస్తా.. మీ ఇంటికి వచ్చి చూస్తా.. నా సంగతి మీకు తెలియదు" అంటూ బెదిరించినట్లు ఇద్దరు రిపోర్టర్లు ఆరోపిస్తున్నారు.


ప్రజాజ్యోతి

02 Sep 2026 - Page 10

# పారిశుద్ధ్యం పడకేసింది..

## - పంచాయతీ బిల్లులు మాత్రం పరుగులు!

- పనులు చేయకుండానే బిల్లులా? ఎంబీలు రికార్డు ఎలా చేశారు?
- పంచాయతీ ఖాతా నుంచి డబ్బులు విత్‌డ్రా..
- క్షేత్రస్థాయిలో మాత్రం చెత్తకుప్పలు!
- అధికారుల నిర్లక్ష్యంతో పంచాయతీకి పంగనామమా?





వార్తపై అభ్యంతరం ఉంటే సంబంధిత పత్రికకు వివరణ ఇవ్వడం, వాస్తవాలు వెల్లడించడం ప్రజాస్వామ్య పద్ధతి. కానీ అందుకు భిన్నంగా రిపోర్టర్లకు ఫోన్ చేసి బూతులు తిడుతూ, దాడి చేస్తామన్న రీతిలో బెదిరింపులకు పాల్పడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని జర్నలిస్టులు అంటున్నారు.

### సోషల్ మీడియాలో పోస్టర్లు.. జర్నలిస్టులపై టార్గెటా?

ఇదే సమయంలో రిపోర్టర్లను కించపరిచేలా రూపొందించినట్లు ఆరోపిస్తున్న పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ కావడం చర్చనీయాంశంగా మారింది. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా వేదికగా అవమానించడం వెనుక ఎవరి ప్రోత్సాహం ఉందో తేల్చాలని జర్నలిస్టులు డిమాండ్ చేస్తున్నారు.

### పంచాయతీ అధికారులు అధికారులు మౌనం వీడాలి

మారేపల్లి గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితిపై ఒకవైపు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు సమస్యను వార్తగా రాసిన రిపోర్టర్లకు బెదిరింపులు వస్తున్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి.బెదిరింపుల ఆరోపణలపై సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో అధికారులు వెంటనే విచారణ చేపట్టాలి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టర్‌పై వాస్తవాలు నిగ్గుతేల్చాలి. రిపోర్టర్లకు ఫోన్ ద్వారా వచ్చిన బెదిరింపులపై కూడా విచారణ జరిపి, తప్పు చేసినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

### ప్రజా సమస్య రాస్తే బెదిరింపులు

ప్రశ్నిస్తే బూతు పురాణం..
వాస్తవాలు వెలుగులోకి తెస్తే "అంతు చూస్తా"..
మారేపల్లిలో సాగుతున్నదేమిటి?
జర్నలిస్టుల గొంతు నొక్కే ప్రయత్నాలను సహించబోమని, ప్రజా సమస్యలపై రాయడం ఆపేది లేదని రిపోర్టర్లు స్పష్టం చేస్తున్నారు.




### గ్రామ సమస్యలు రాస్తే అంతు చూస్తా" ఇదేనా పెత్తనం?

ప్రజల తరపున ప్రశ్నించే మీడియా ప్రతినిధులపై వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంతవరకు సమంజసమని జర్నలిస్టులు ప్రశ్నిస్తున్నారు. సర్పంచ్ పదవి ప్రజలకు సేవ చేయడానికి కానీ, ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి కాదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

### బూతు పురాణంతో భయపెట్టే ప్రయత్నం

# గ్రామంలోకి వచ్చే రోడ్డు భాగుచేయాలి
## చివర్షం పడితే కాలి నడక కూడా నడవలేని పరిస్థితి
## – గ్రామస్థుల విజ్ఞప్తి

**మునిపల్లి సెప్టెంబర్ 2**

**(ప్రజాజ్యోతి):**




మునిపల్లి మండల పరిధిలోని గార్లపల్లి గ్రామము లోకి వచ్చే ప్రదాన రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలు పడటంతో వర్షము పడ్డప్పుడు బురద, మయమవుతున్నదని ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని గ్రామ ప్రజలు తెలిపారు. ప్రజా జ్యోతి గ్రామాన్ని సందర్శించగా గ్రామములో గల సమస్యలను వివరించారు. ఎన్నికలప్పుడు అన్ని





రకాల అభివృద్ధి చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన సర్పంచ్ ఏ సమస్యను పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. సర్పంచ్ స్థానికంగా ఉండకుండా చుట్టపు చూపుగా వస్తే గ్రామము ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నిస్తున్నారు. గ్రామము అనేక రకాలుగా వెనుకబడింది ,గ్రామాన్ని ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రధాన రోడ్డు దాటి గ్రామంలోకి ప్రవేశించే రోడ్డు పరిస్థితి ఈ విధంగా ఉంటే గ్రామములో నెలకొన్న సమస్యలు ఇంకెట్లా ఉన్నాయో అధికారులు, ప్రజాప్రతినిధులు అర్థం చేసుకోవాలని విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు ను భాగుచేయాలని, గ్రామములో గల అనేక రకాల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.వా

# దిన దిన అభివృద్ధి చెందుతున్న మునిపల్లి చౌరస్తా

**మునిపల్లి సెప్టెంబర్ 2(ప్రజాజ్యోతి):**

మునిపల్లి చౌరస్తా దినదిన అభివృద్ధి ఎప్త్రఅచెందుతుంది. జాతీయ రహదారి బుదేర చౌరస్తా కు 6 కిలోమీటర్ల దూరం,సింగూరు ప్రాజెక్టు, పుల్ కల్ , రాయి కోడ్ ,జోగిపేట,ఆంధోల్,సదాశివపేట, జహీరాబాద్ ప్రాంతాలకు మధ్య మార్గంగా ఉండటంతో,ఈ ప్రాంతము గత నాలుగు ఐదు సంవత్సరాల నుండి అన్నిరకాల వ్యాపార సంస్థలతో అభివృద్ధి చెందుతుంది. ఖమ్మం పల్లి,మునిపల్లి గ్రామాల పరిధి లోని ప్రజల వ్యవసాయ భూములు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రాంతము పూర్తిగా వ్యవసాయ వ్యవసాయ ఆధారిత ప్రాంతము కాబట్టి మునిపల్లి మండల కేంద్రానికి,జాతీయ రహదారికి అనుబంధమూ ఉండటంతో రవాణ,మార్కెట్ సౌకర్యాలు వస్తూ క్రయ విక్రయాలు బాగా జరుగుతాయని ప్రజల,వ్యాపారులు చెపుతున్నారు. ఇటు ప్రజలకు వ్యాపారులకు ఈ ప్రాంతము అనుకూలంగా మారిందని చెప్పవచ్చు. తద్వారా ప్రభుత్వాలకు ,గ్రామ పంచాయతీలకు శిస్తులరూపేనా నిధులు కూడా జమావుతున్నాయని ప్రజాప్రతినిధులు అధికారులు చెపుతున్నారు. చౌరస్తాలో మరిన్ని వ్యాపార సౌకర్యాలు కల్పించి ప్రజా ,ప్రాంత అభివృద్ధికి సాకరించాలని అధికారులను,ప్రజాప్రతినిధులను పారిశ్రామిక రంగాల వర్గాలను ఈ ప్రాంత ప్రజలు ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు.





# పదోన్నతి పొందిన డీఎస్ జగన్‌కు టీడబ్ల్యూజేఎఫ్ నేతల శుభాకాంక్షలు

**సంగారెడ్డి, ప్రజా జ్యోతి ప్రతినిధి :**

సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకుడిగా పదోన్నతి పొందిన డీఎస్ జగన్‌కు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎల్గోయి ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పదోన్నతితో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. జర్నలిస్టులు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు.కొన్ని జిల్లాల్లో జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల జారీ విషయంలో డీపీఆర్వోలు జాప్యం చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా డీఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన ఆయా జిల్లాల డీపీఆర్వోలతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల జారీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# వెయ్యి రోజుల అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## - మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. గృహ జ్యోతి. రైతులకు రుణ విముక్తి. అంశాలతో ప్రభుత్వం అందించిన పథకాలపై అవగాహన కలిగించాలి.

## - ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి





**కల్హేర్. 2. సెప్టెంబర్.ప్రజా జ్యోతి .**

: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులుగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మాట్లాడుతూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కార్యకర్తలు సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 1 నాటికి విజయవంతంగా 1000 రోజుల పాలనను పూర్తి చేసుకుందని ఎమ్మెల్యే తెలిపారు. గత మూడేళ్లుగా పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు.

### రైతు సంక్షేమానికి పెద్దపీట

25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ.
రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా పెట్టుబడి సాయం.
వ్యవసాయానికి ఉచిత విద్యుత్తుతో పాటు రైతు సంక్షేమం కోసం రూ.1.72 లక్షల కోట్ల వ్యయం.
మహిళలు, కుటుంబాలకు అండగా
మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో దాదాపు రూ.12,167 కోట్ల మేర ప్రయాణ ఛార్జీల ఆదా.
గృహజ్యోతి పథకం కింద 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు.
43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్.
4.54 లక్షల మహిళా సంఘాలకు రూ.60,487 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు, రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ.
పేదలకు గృహ వసతి
తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు.
గ్రేటర్ హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇండ్ల టవర్లతో పాటు లక్ష మందికి ఇందిరమ్మ ఇళ్లు కల్పించే కార్యక్రమం కొనసాగుతోందన్నారు.

### ఉద్యోగాలు, విద్య , సంక్షేమం

72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, మరో 7,437 పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్.



ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.38 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ.
15.46 లక్షల కొత్త రేషన్ కార్డుల జారీ.
సామాజిక భద్రతను విస్తరిస్తూ 2.25 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు.
22 లక్షలకు పైగా విద్యార్థులకు అల్పాహారం, పాలు, పోషకాహారం అందించేందుకు రూ.720 కోట్ల కేటాయింపు.
ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 5,18,186 మంది పేద రోగులకు రూ.2,527 కోట్ల ఆర్థిక సాయం.
రిటైర్డ్ ఉద్యోగులకు 100 రోజుల్లో రూ.6,000 కోట్ల బకాయిల చెల్లింపు.
ఐటీ రంగంలో తెలంగాణ దూసుకెళ్తోంది
202526లో తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరుకున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.
రాష్ట్రంలో 12.14 లక్షల ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాలు ఉన్నాయని, హైదరాబాద్‌లో 355 గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు (జీసీసీ లు) ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి కోరారు.
ప్రగతి పథం.. సకలజన హితం.. ఇదే మన ప్రజా ప్రభుత్వం.